# నమ్మలేని నిజాలు

ముప్పాళ్ల రంగనాయకమ్మ




"శ్రీను పెళ్ళిట."

"ఏమిటీ?" అన్నట్టు చూశాను.

ఉత్తరం నాకు పడేసి బట్టలు మార్చుకో సాగా రాయన.

నేను విన్నది మరోసారి నా చెవుల్లో ధ్వనించింది — "శ్రీను పెళ్ళిట."

నమ్మలేనట్టు చూశాను — "శ్రీనివాస్‌కి పెళ్ళా? నిజంగానే?" ఎంతో ఆశ్చర్యం ముంచుకు వచ్చింది — ఆయన మౌనం ధరించారు.

"ఏమిటండీ మాట్లాడరూ? శ్రీనుకి పెళ్ళి కుదిరిందా?" రెట్టించాను.

"పెళ్ళి కుదరటంలో ఆశ్చర్య మేముంది? ఇవ్వాళ కాకపోతే రేపైనా జరగాలి — ఏమిటో...ప్చ్...వాడి దో పిచ్చిధోరణి."

"ఏమిటబ్బా? ఏమైంది?"

"నీకీ చాదస్తం పోదుమరి — ఉత్తరం నీ చేతుల్లో పడేస్తే నన్ను చంపుతా వేమిటి? — సరేలే — తర్వాత తీరిగ్గా చదువుకు విచారిద్దుగాని — ముందు నాకు వడ్డించు, పోవాలి" బాత్‌రూంలోకి నడిచా రాయన.

నా కంతా అయోమయంగా వుంది.

శ్రీనివాస్‌కి పెళ్ళి కుదిరిం దంటే సంతోషంగా—ఆశ్చర్యంగా — కొంచెం దిగులుగా—మరెంతో ఆతృతగా నానా రకాలుగా వుంది.

నేను కాపురానికి వచ్చిన కొత్తలో ఓ సాయత్రం—మావారు సన్నగా, తెల్లగా పొడుగ్గా సూర్యకిరణంలా వున్న ఓ వ్యక్తిని పరిచయం చేసిన సంఘటన మరుపురాకుండా నిలిచిపోయింది.

"ఇడుగో మీ అన్నగారు — సాక్షాత్తూ శ్రీనివాసుడు!" అంటూ నవ్వారు మావారు. శ్రీనివాస్ సిగ్గుపడుతోంటే అతని మొహంలోకి చొరవగా ధైర్యంగా చూశాను.

ఎందుకో చెప్పలేను. శ్రీను అంటే నాకు చాలా యిష్టం. పసిపిల్లల కుండే అమాయకత్వం — మంకుతనం — పంతం పట్టుదలా అతని కున్నాయి.

అత నెంత తెలివిగలవాడో అంత అమాయకుడు.

ఎంత గడుసువాడో అంత పిచ్చివాడు.

అతని దొక ఆదర్శ ప్రపంచం! అతని దొక వూహాలోకం!

అతని వ్యక్తిత్వం మహా పదును! ఆలోచనలు మహా వాడి! ఎదటివారి కళ్ళలోకి ధైర్యంగా చూడటం — ఏది తలపెట్టినా సూటిగా పోవటం అతని లక్షణాలు.

శ్రీనివాస్ మా దంపతుల కిద్దరికీ అత్యంత ఆత్మీయుడు! సన్నిహితుడు!

శ్రీను ప్రత్యేకంగా నన్ను మరింత అభిమానిస్తాడు — ప్రేమిస్తాడు.

శ్రీనివా సేమిటో నా కర్థ మయ్యేలా చేసిం దో సాధారణ సంఘటన—ఏదోపిక్చర్‌కి వెళ్ళాలని మే మిద్దరం బయల్దేరుతూన్నంతలో శ్రీను వచ్చాడు—నిజాని కా సమయంలో అతని రాక చాలా సంతోషం కల్గించింది— "మంచి సమయంలో వచ్చా వన్నాయ్!" అన్నాను నవ్వుతూ.

"ఇప్పుడే సినిమాకి బయల్దేరుతున్నాం, రా! నడు నువ్వు కూడా" అన్నారు మావారు—శ్రీను ఆశ్చర్యంగా చూశాడు —

"నేనా? మీతోనా?"

"ఏం? అంత చిత్రంగా అడుగుతున్నావ్?" అన్నాను.

"ఊఁహూ! పిక్చర్లూ—షికార్లూ అంటే మీ రిద్దరే వెళ్ళాలి. మధ్య నే నెందుకు" అన్నాడు నవ్వుతూ—

"భలేవాడివే! మే మిద్దరం ఎన్నిసార్లు వెళ్ళటం లేదు? ఈ సారి మనం ముగ్గురం కలిసి వెళ్దాం" — నేను ప్రాధేయతగా నే అడిగాను.

"మాకు లేని అభ్యంతరం నీ కేమిట్రా? మహాగొప్ప సూత్రాలూ నువ్వూను —" మావారు మందలించారు కూడాను.

అడ్డంగా తల తిప్పాడు శ్రీను.

"మీకు జ్ఞానం లేదేమోగానీ నాకువుంది."

"ఓహో! అయితే రేపు మీఆవిడొస్తే.."

"నిర్మొహమాటంగా చెప్పేస్తాను — 'ఎక్స్‌క్యూజ్ మీ! మా ఎంగేజ్‌మెంట్స్ పాడు చెయ్యకండీ ప్లీజ్!' అని."

ఇక ఆ రోజు మాత్రం శ్రీనివాస్‌ని తీసికెళ్ళలేకపోయాం మాతో. శ్రీను వ్యక్తిత్వాన్ని నేను అభినందించకుండా కూడా వుండలేకపోయాను — అలాంటి శ్రీనుకి పెళ్ళిపట్ల సాధారణమైన అభిప్రాయా లుంటా యని నేను అనుకోనూ లేదు. లేవు కూడాను.

"నీ పెళ్ళి హడావుడితో సర్దాగా తిరగాలని వుం దన్నాయ్" అన్నా నోసారి తీరిగ్గా కూర్చుంటూ.

"ఏమిటో సుధా! పెళ్ళంటేనే భయంగా వుంది నాకు" అన్నాడు ఆదోలా.

ఏదో హాస్యాని కంటున్నా డనుకున్న నేను శ్రీను ముఖకవళికలు చూసి విస్తుపోయాను. గంభీరంగా రాధా కృష్ణుల విగ్రహం కేసి చూస్తూ వుండిపోయాడు —

"అసలు నీ వుద్దేశ్యం ఏమిటో చెప్పు అన్నాయ్" అన్నాను కొంత సేపటికి. చటుక్కున తలతిప్పాడు— "దేన్నిగురించి?"

"అదే! ఇప్పు దేదో అన్నావు కదూ? పెళ్ళంటే భయ మనో ఏమిటో."

"ఓ! అదా? అబ్బే! చెప్ప టానికేముంది? నువ్వూ చూస్తున్నావ్‌గా? ఈ రోజుల్లో సాధారణంగా ఏ పెళ్ళీ సక్సెస్ కావటం లేదు—వధూవరుల యిష్టాలు చూడకుండా పెద్దవాళ్ళు నిర్ణయించే పెళ్ళిళ్ళ నెప్పుడూ సమర్థించను. పోతే ప్రేమవివాహాల్లో కూడా నమ్మకం పోతోంది సుధా! అవి మరీ అధ్వాన్నంగా తయారౌతున్నాయి — అయితే వివాహ మనేది నూటికి నూరుపాళ్ళు విజయవంతం కావాలంటే మార్గం ఏమిటి? — అదే నాకు భయంగా వుంటుంది."

"అసలు పెళ్ళి విజయవంతం కావటం అంటే అర్థం ఏమి టంటావు?"

"పరిపూర్ణమైన శాంతి సౌఖ్యాలతో అలరారే దాంపత్యమే నిజమైన పెళ్ళికి నిదర్శనం—కాదంటావా?"

"ఎప్పుడూ అనలేను. — కాని నువ్వు వూహాజీవి వన్నాయ్! వాస్తవాలు చాలా ఘోరంగా వుంటాయి. నీ భార్యని ఎంతో ప్రేమించాలనీ—మానసికంగా స్వతంత్రం యివ్వాలనీ — నిజమైన ఆదర్శ దాంపత్యం సృష్టించాలనీ—అనుకుంటావు—కాని ఏవిధంగానూ నువ్వు సమర్థించుకోలేని పరిస్థితులు ఎదురు పడవచ్చు—నీ అభిప్రాయాలు విన్నే ఎగతాళి చేయవచ్చు—భిన్న ప్రాంతాలలో పుట్టి భిన్న వాతావరణాలలో పెరిగి, భిన్నవ్యక్తిత్వాలు ఏర్పర్చుకున్న ఇద్దరు వ్యక్తుల కలయికలో పూర్తి విజయం లభించకపోవచ్చు. అంత మాత్రాన అది పెళ్ళే కాదంటావా?"

"కాదు సుధా! పెళ్ళి కాదు. రుచులూ — అభిరుచులూ — కోరికలూ — గుణాలూ — అభిప్రాయాలూ — వ్యక్తిత్వాలూ ఏకీభవించని యిద్దరు వ్యక్తులు పెళ్ళి పేరిట ఓ యింట్లో కాపురం ప్రారంభిస్తే రెండు పాషాణాలు ఢీకొన్నట్టే."

"కాదన్నాయ్! నువ్వు పెద్దవాడివి. చదువుకున్నావు. ఆలోచించు. అడుగడుగునా మన సూత్రాలు పనికిరావు. ఫలితా న్నివ్వవు — మనిషి కో వ్యక్తిత్వం వుంటుంది—మనిషి కో అభిరుచి వుంటుంది. నీకు తీపియిష్టం—ఆమెకు పులుపు యిష్టం! నీకు చలం యిష్టం! ఆమెకు శరత్ యిష్టం! నీకు మల్లెలు యిష్టం!

ఆమెకు మందారాలు యిష్టం! ఇంత మాత్రాన మీ రిద్దరూ ఒకటి కాకూడదనీ_ఒకచై సుఖ పడలేరనీ అనుకోవచ్చునా ?''

"కాని సుధా ! ఇద్దరిదీ ఒకటే దారైతే ప్రయాణం జంటగా జరుగుతుంది గదూ ?"

అలాంటి శ్రీనివాస్‌కి వధువు దొరకటం మాటలా ? హాస్యానికి అన్నాను _ "సంఘం ప్రసాదించిన నీ పురుషాధికారా లన్నీ సద్వినియోగం చేసుకో నంటే నీ దాంపత్యసుఖాని కెన్నడూ లోటు వుండ దన్నాయ్. అవు నంటావా !''

శ్రీనివాస్ నవ్వాడు _ ''ఈ సలహాలో నీ స్వార్థం — జాతి పక్షపాతం చాలా వున్నాయి."

"నీ పరధ్యానంతో నన్ను చంపుతున్నావు. మజ్జిగలో వుప్పు వేశావా ?'' విసుక్కున్నారు మా వారు_ఆయన ఓ పావు గంటనుంచీ విసుక్కుంటూనే వున్నారు - ఎలా అన్నం వడ్డించానో ఎలా తిని లేచారో నాకు తెలీనే లేదు —


"తలుపులు బిడాయించుకుని సాయంత్రం వరకూ ఆలోచిస్తూ పడుకో_పోతున్నాను'' అంటూ సైకిల్ తాళం తిప్పుకుంటూ వెళ్ళిపోయా రాయన.

ఓ ఏడాది క్రిందట వుద్యోగ రీత్యా బదిలీ అయ్యి శ్రీను మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు_పెళ్ళిళ్ళపట్ల శ్రీను అభిప్రాయాలు ఏమంత మారినట్లు కనిపించదు_వుత్తరాల్లో కూడా వాదనలు జరుపుతూంటాడు. అలాంటి శ్రీనివాస్‌కి పెళ్ళి కుదిరిందంటే నాకు ఆతృత కాదూ?

శ్రీను రాసిన వుత్తరం చదువుకున్న నాకు పరధ్యాన్నం రాదూ ?

"సుధా ! చెల్లీ !

ఈ విషయం నీకు చాలా ఆశ్చర్యం కల్గిస్తుందేమో ! నన్ను అర్థం చేసుకుంటావని నీకు ప్రత్యేకంగా రాస్తున్నాను _ బావ ద్వారా మిగతా విషయాలు కూడా తెలుసుకుంటావు.




కుసుమ్ ఫొటో కూడా పంపించా లనుకున్నాను. సమయానికి అందలేదు_కుసుమని నేను రిజిష్టర్ మారేజ్ చేసుకోవటానికి నిశ్చయించాను. ఇక్కడ నీకు కుసుమ్ గురించి చెప్పాలి. అది చెప్పరాని దనీ _ దాచుకోవా లనీ కూడా నేను అనుకోను. అందరికీ తెలిసిన ఈ విషయాలు నీకు మరుగుపర్చగలనా ?

కుసుమ తెలుపూ నలుపూగాని రంగులో వుంటుంది. చక్రాల్లాంటి కళ్ళతో చక్కని దానిలా కన్పిస్తుంది. పొడుగుపాటి జడ వున్నా అప్పుడప్పుడూ ముడివేస్తూ వుంటుంది _ మా ఆఫీసులో టైపిస్ట్‌గా పని చేస్తున్న ఈ కుసుమకి ఇరవై ఏడు సంవత్సరాలు ! అంటే నాకన్నా దాదాపు ఓ సంవత్సరం పెద్దది _ వర్ణాంతరం _ తండ్రిలేదు _ కాలేజీ చదువులు కావాల్సిన తమ్ముళ్ళూ _ స్కూలు చదువులేనా పూర్తిచెయ్యాల్సిన చెల్లెళ్ళూ _ కొత్త కొత్త మందు లన్నీ వాడాల్సిన రోగిష్టి తల్లీ _ ఇన్ని వ్యాధులతో _ ఇన్ని సమస్యలతో _ కుసుమ శీలాన్ని దాచుకునేస్థానమూ_ అవకాశమూ లేకపోయాయి. ఆప్తుల క్షేమం కోసం _ కడుపునిండా అన్నం కోసం _ పవిత్ర భారత నారీత్వాన్ని అతి తేలిగ్గా ఆహుతి చేసుకుంది.

ఈ సంగతు లన్నీ తనే నాకు స్వయంగా చెప్పింది. మా యిద్దరికీ సాధారణ స్నేహం తప్పితే హద్దులుమీరిన అనురాగ మేమీలేదు.

కుసుమ్ గాథ వింటే ఎవరికైనా జాలి వేస్తుంది; నాకూ జాలి వేసింది _ కాని కుసుమ్‌ని పెళ్ళి చేసుకో కూడదా, అన్న ఆలోచన అందరికీ రాకపోవచ్చు, నాకు వచ్చింది _ ఆలోచించాను.

కుసుమ చెడిపోయింది సంఘందృష్టిలో. కాని కుసుమ తన చెల్లెళ్ళను చెడిపోకుండా బాగుచేసింది.

తమ్ముళ్ళను ఆకలితో చచ్చిపోకుండా బ్రతికించింది.

ఈ కుసుమ హృదయ పవిత్రతని ఏనాటికీ చూడలేదు సంఘం. నేను చెడిపోతే నాకు అంటని కళంకం కుసుమ కెందుకు ? ఎక్కడుందీ న్యాయం ? _ నేనే కుసుమ్‌ని పెళ్ళి చేసుకుంటాను.

ఈ మాటే చెప్పినప్పుడు విస్తుపోయింది కుసుమ. నిజమే నని నమ్మించబోతే భయపడింది _ ఏడ్చింది.

కుసుమ్‌ని వుద్ధరించా లనే ఆదర్శంతో గానీ _ కుసుమ కన్నీటికి కట్టుబడి గానీ నే నీ నిర్ణయానికి రాలేదు సుధా !

కాని....మాచుట్టూ వున్న వలయాలు మహావేగంతో భ్రమిస్తున్నాయి. తల్లిదండ్రులూ_ అక్క చెల్లెళ్లూ _ స్నేహబృందాలూ_మంచి చెడ్డలూ _ నన్నెన్నో విధాల పరిహసిస్తున్నాయి.

సుధా ! నేను మూర్ఖుడిలా ప్రవర్తిస్తున్నా నంటున్నా రంతా. చెప్పు సుధా ! నీ అభిప్రాయంలో నాకు విశ్వాసం వుంది. నీతీర్పులో నాకు నమ్మకం వుంది — కుసుమ జీవితం శాశ్వతంగా వేదనలకే అంకిత మంటావా ? కుసుమని ఓ గట్టు చేర్చగలిగే శక్తి మనకు లేనేలేదంటావా? — నీ వుద్దేశ్యం ఎటువంటిదైనా, రాయి. పెళ్ళి జరిగాకనైనా వింటాను —

నీ అన్నయ్ !"

నా కేమిటో గట్లుతెగిన దుఃఖం— అవధులు మీరిన ఆనందం కలగలుపుగా ముంచుకు వచ్చాయి.

శ్రీనివాస్... ఎందు కింత పిచ్చిగా ఆలోచిస్తాడు ? ఎందుకింత వెర్రిలోకం సృష్టించుకుంటాడు ? బ్రతుకంతా ఆదర్శమయం కాదు. జీవితం పొడుగునా త్యాగాలు చేసుకొంటూ వెళ్ళలేం. కుసుమ్‌పట్ల — నా కేమీ ద్వేషంలేదు — శ్రీనివాస్‌ను భర్తగా పొందగలిగేంత అర్హురాలా కుసుమ ?

కాకూడదా ? శ్రీను ఎప్పుడో ఇటువంటి సాహసం చేస్తాడని తెలుసు — శ్రీను యింత గొప్పవా డంటే...శ్రీను వ్యక్తిత్వం ఇంత బలమైనదంటే ... శ్రీను సంస్కారం యింత వున్నతమైన దంటే..ఎక్కడెక్కడో నా అంతరాంతరాలలో మహదానందంగా వుంది. మహాతిశయంగా వుంది.

కుసుమ కృతజ్ఞతతో — అభిమానంతో అనురాగంతో భర్తకు స్వర్గసౌఖ్యాలు చూపించకూడదా? లేక శ్రీనివాస్ ఆవేశాలకు లోబడి విషవలయంలో చిక్కుకుంటాడా ? ఈ వివాహంతో ఆ యిద్దరి జీవితాలూ సర్వనాశన మౌతాయా ?

మరి ఆలోచించలేక నేపోయాను. సాయంత్రం మావారితో అన్నాను,

"శ్రీనుకి....ఆ పెళ్ళి చేసుకోవద్దని ఉత్తరం రాస్తేనో !"

"వాడికా ? నీ పిచ్చి..."

"అంతే నంటారా ?" దిగులుపడ్డాను.

"ఇది నీకూ నాకూ పెద్దసమస్యగా కన్పిస్తోందిగానీ వాడి కో విశేషమేకాదు — వాడి మనశ్శక్తిని వాడు అంచనా వేసుకోగలడు సుధా !"

"ఆ అమ్మాయి ఎలాగూ చెడిపోయింది. తమ్ముళ్ళనీ చెల్లెళ్ళనూ చదివించుకొంటూ అలా వుండిపోరాదూ ?" — శ్రీను పెళ్ళిని నే నేమంత సమర్ధించలేకపోయాను పైకి.

శ్రీనివాస్ రాసిన ప్రకారం మా వారు పది రోజులు శెలవుపెట్టి బయల్దేరి వెళ్ళారు పెళ్ళికి.

* * *

అకస్మాత్తుగా వూడిపడ్డాడు కేశవ్ ! నాకు ఎందరో అన్నయ్యలున్నారు. మరెందరో తమ్ముళ్లూ వున్నారు — అలాంటి తమ్ముడే ఈ కేశవ్ ! నాకు పెదనాయనమ్మ మనవడు — యూనివర్సిటీని పరిపాలిస్తూ — హాస్టల్‌ని వుద్దరిస్తూ మధ్య మధ్య మా యిల్లు పావనం చేస్తూవుంటాడు.

చాలారోజులకి వచ్చాడుగదాని వాడి కేసి సంతోషంగా చూస్తే — చామనచాయగా ఎత్తుగా, దృఢంగా, నాయుడుబావలా వుండే ఈ కేశిబాబుకాస్తా ఓ సంవత్సరం నుంచీ అన్నం నీళ్ళూ — నిద్రా నిప్పులూ లేనట్టు ఎర్రటి జ్యోతుల్లాంటి కళ్ళతో — చిందరవందర జుట్టుతో కన్పించాడు, క్రితంరోజు కొన్న తోటకూరకాడలా — వాడిపోయి — పాలిపోయి.

"ఏమిట్రా విశేషం ?" అన్నానో లేదో బిక్కమొహం వేసేశాడు. బుద్ధిగా జేబులోంచి ఓకాయితం తీసియిచ్చాడు. చదివాను— సానుభూతిగా — ఆశ్చర్యంగా వాడికేసి చూసాను, వాడికి నాకేసే చూడాలని వున్నా ఎటో చూస్తున్నాడు. వుత్తరం విసిరేస్తూ — "ఇక తగలడు," అన్నాను కోపంగా. జాలిగా చూశాడు — దీనంగా చూశాడు. బాధతో నిట్టూర్చాను. ఆ చూపే వాణ్ణెప్పుడూ ప్రేమించనిస్తుంది. వాడిమీది విసుగంతా పోగొట్టేస్తుంది. నెమ్మదిగా తీసుకుని వుత్తరం మరోసారి చదివాను. సుశీలకి పెళ్ళి నిర్ణయమై పోతోందట. నేడో రేపో పెళ్ళి చూపులుకూడా జరగబోతున్నాయట—సుశీలా వాళ్ళన్నయ్య సత్యంబావ కేశిబాబుకు వుత్తరం రాశాడు — ఎంతైనా ప్రాణంవుండబట్టక.

సుశీల కేశవ్‌కి మేనమామకూతురు — నాకు మేనత్తకూతురూను. ఆవిడా ఈయనా ఒండొరులూ గాఢంగా ప్రేమించుకున్నారు — వుత్తరాల్లో — వూహల్లో — వాటిని వాస్తవం చేసుకునేపాటిధైర్యంలేదు కేశిబాబుకి. అర్ధణా కోసం పదహారు మైళ్ళు నడిచివెళ్ళగల బాబాయి — కేశవ్ నాన్న ...కొడుకుగాథలో ఓ దుష్టుడూ..వరకట్ననిషేధచట్టం వస్తోన్న రోజుల్లో ప్రభుత్వంవారి అమాయకత్వానికి కుళ్ళి కుళ్ళి నవ్వుకున్నవాడూను.

చేసేదిలేక సుశీలకి మరో సంబంధం నిర్ణయిస్తున్నారు కాబోలు.

"అయితే యిప్పు దేమంటావ్ ?" అన్నాను కేశవ్ మొహంలోకి చూస్తూ. కాస్త తాపీ పడ్డట్టున్నాడు — "నువ్వేదయినా సలహా యిస్తావని వచ్చానే''.

"నా సలహాకేం? ఎప్పుడూ చెప్తూవున్నదే" అన్నాను నిర్లక్ష్యంగా. ఓక్షణం విరామం — గొప్ప ధర్మసందేహం వుద్భవించినట్టే అడిగాడు — "అయితే ఆ పెళ్ళిచూపులికి సుశీలెలా ఒప్పుకుంటుం దంటావ్ ?"

"నీకు బుద్ధివుందా లేదా ? అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కుతినా తిననివ్వదన్నట్టే వుంది. సుశీల కాబట్టే యిన్నాళ్ళూ ఓపిక పట్టింది.మరెవతైనా అయితే ఏనాడో నీ కో డోసు యిచ్చేది." నాకు చెడ్డకోపంవచ్చింది.

ఊరుకున్నాడు.

"ఎలాగూ నీకు దాన్ని చేసుకునేధైర్యం లేదుకాబట్టి నిక్షేపంలా దాన్ని వేరేపెళ్ళి చేసుకోనీ !"

"అంతేనా ?" అన్నట్టు చూశాడు దీనంగా.

"అసలు సుశీలని దక్కించుకోవా లనే కోరిక వుందా నీకు ?" అన్నాను లాయర్ లాగా మొదటి కొస్తూ.

వాడికి వుక్రోషం వచ్చింది— "నీ దగ్గరికి

పరిగెత్తుకురావటం ఎందుకు ? బొమ్మలాటకా ?" అన్నాడు విసురుగా.

కాస్త దారిలోకి వస్తున్నాడని సంతోషం వేసింది – "అయితే సరే ! మీ నాన్నకో వుత్తరం రాయి."

"నాన్నకా ? ఏమని ?"

"సుశీలకి వేరే పెళ్ళిప్రయత్నా లేవో చేస్తూన్నట్టు తెలిసిందనీ – కాని దాన్నే చేసుకోవాలని నీకు వుందనీ – కాబట్టి..."

"అలా రాయనా ? మా నాన్నకా ? నేనా?"

"ఊహూ ! మా నాన్నకి నేను రాస్తాలే సుశీలని చేసుకుంటా నని."

"అదికాదే సుధా ! మా నాన్న సంగతి నీకు తెలుసుకదే." బిక్క మొహం వేశాడు.

"ఒప్పుకో డంటావ్."

"చస్తే ఒప్పుకోడు – ఓ అరవై వేలూ, చిన్నకారూ..."

"నీకే నయంగా ? ఎంచక్కా బోలెడు రూపాయి లొస్తాయి. పోనీ మీనాన్న కుదిర్చే పిల్లనే చేసుకో."

"నా కోమూల ఏడుపొస్తోంటే..."

"నాకూ ఒస్తోందిరా నిన్నూ, నీ ఏడుపూ చూస్తోంటే–నీకు సుశీల కావాలి. ఆ సంగతి మీ నాన్నకి చెప్పలేవు, ఎలా ?" ఓ ఘడియ నిశ్శబ్దం !

"పోనీ ఓలా చేస్తావా ?" చెయ్యగలవా ? అని అడక్కూడదు. దాని కేదో గొప్ప శక్తి కావా లనుకుంటాడు వాడు.

"ఏమిటి ?" అన్నట్టు చూశాడు ఆశగా.

"సుశీలనాన్నకి వుత్తరం రాయి."

"నేనా ?"

"ఒరేయ్ ! వెర్రివెధవలా మాట్లాడకు. నీకోసం కాకపోతే ఈ కంఠశోషంతా దేనికి ?"

"అయితే ఏం రాయాలీ ?"

"సుశీలని చేసుకోవటం నీకు బాగా యిష్టమనీ– వేరే పెళ్ళిప్రయత్నాలు చెయ్యొద్దనీ.."

"ఛ ! మన ప్రిస్టేజీకి భంగం కదే ! నాన్నని షేమ్ చేసినట్టుకాదూ ?"

"ఆహా ! పుత్ర రత్నమా ! శ్రీరామచంద్రుడి తర్వాత నువ్వేనురా పుట్టావ్."

"అబ్బ ! నీకు హాస్యా లేమిటే సుధా ?" బాధగా చూశాడు.

"కాకపోతే నన్నేంచెయ్యమంటావ్ చెప్పు – దేనికీ నీకు తెగింపు లేదు – పోనీ మరో వుపాయం–ఇన్నాళ్ళూ మీనాన్ననడిగితే నీయిష్టం అంటున్నాడు – నిన్నడిగితే తన యిష్టం అనమంటున్నాడు – ఈ దొంగనాటకానికి అవకాశం ఇవ్వకుండా మీ రిద్దరూ కలిసివుండగా ఆకస్మాత్తుగా మామయ్యా వాళ్ళు వచ్చి అడిగే సన్నివేశం ఒకటి ఏర్పరిస్తే బ్రహ్మాండంగా వుండదూ ? బాబాయికి తప్పుకునే అవకాశం వుండదు – "మావా డిష్టమే" అంటాడు. అప్పుడు నీ వుద్దేశ్యం ఖచ్చితంగా చెప్పెయ్."

"అయితే నాన్న కిష్టంలేని పెళ్ళి చేసుకుంటోంటే..."

"ఒరేయ్ ! శతకోటి ఆశీస్సులు ! వెళ్ళి వస్తావా ?"

"అలా విసుక్కోకేసుధా ! మరి నాన్నని..."

"చూడు కేశవ్ ! నేనేం హాస్యానికి చెప్పటంలేదు. పెద్దరికాలకు కూడా కొంతవరకే వుంటుంది విలువ. వాళ్ళు మూర్ఖులు కానంతవరకూ తల్లికీ బిడ్డకీ – భర్తకీ భార్యకీ – కూడా కొన్ని అవధు లుంటాయి. బాబాయి విషయమే తీసుకుందాం. నాలుగు తరాల వరకూ తగలేసుకున్నా తరగని ఆస్థి సంపాదించాడు. డబ్బు ప్రశ్న లేనేలేదుకదా? పోతే నీ కోరిక తనకు బాగా తెలుసు. మీ రిద్దరూ వుత్తరాలు రాసుకొంటూ వుంటారనికూడా తెలుసు. తెలిసి తెలిసి కేవలం డబ్బుకి ఆశపడి మీ యిద్దర్నీ కలపాలని తాపత్రయ పడకపోగా విడదియ్యాలని ప్రయత్నిస్తున్నా డంటే అది కొడుకుపట్ల కన్నతండ్రికి వుండాల్సిన పవిత్ర ప్రేమకి నిదర్శన మంటావా ? నీకు సుఖశాంతులే తను కోరుకుంటున్నా డనగలవా ?"

"కొంచెం ఆగు సుధా ! తల్లి దండ్రులు



బిడ్డల్ని ప్రేమించడంలో లోటు చేస్తా రన్నది నిజం కాదు — అయితే నాన్న ఈ పెళ్ళి కెందుకు ఒప్పుకోడంటావ్— ఒక్కటి ఆలో చించిచూడు ! నాన్న మనకన్న ఓ తరం వెనకవాడు. పెళ్ళికి ప్రేమ ముఖ్య మన్న సిద్ధాంతం ఆయనకు తెలీదు. తెలిసినా ఒప్పు కోడు. డబ్బు అనేది ఎంత ఎక్కువ వున్నా చేదుకాదు. కట్నంపేరిట ఇంకా వచ్చిపడితే కొడుకు కోటీశ్వరు డైపోతా డని ఆయన సంతోషం: మరేపిల్లని పెళ్ళి చేసుకున్నా ఫరవాలే దని...''

''పోనీ ఓ తరం ముందువాడివిగా ? నీ ప్రేమవ్యవహారం విపులంగా వెల్లడించి బాబాయిని ఒప్పించాల్సిన బాధ్యత నీ మీద లేదూ ?"

''అదే వచ్చిపడింది— ఆయన ఎదురుగా నిలబడితే నోరువిప్పలేను. అసలు చెప్పాలను కున్న దేమిటో మర్చేపోతాను. పైగా మంచాలగుంటపాటి సంబంధం ఖాయంచేశా నంటే కిమ్మనకుండా యివతలి కొస్తాను."

"నిజం చెప్పొద్దూ ! నీవంటి పుత్ర రత్నాన్ని కనగల్గిన బాబాయి మహాదృష్ట వంతుడు."

''చెప్పుసుధా ! నన్నేంచెయ్యమంటావ్'' మళ్ళా ఏడుపు మొహంతో.

''దేవుడా ! ఇదేం జిడ్డురా తండ్రీ !''

''నీ స్వగతాలు తర్వాత. ముందు నాకో చక్కని సలహా..."

''ఇమ్మంటావ్, సరే ! ఆఖరిఅస్త్రం — మీ నాన్నకి తెలీకుండా రహస్యంగా సుశీలని...''

''అమ్మో ! చెయ్యలేను. నే చెయ్యలేను"

"ఒరేయ్ ! నా ముందునుంచి లేచిపో ! దౌర్భాగ్యుడా ! ఇంత పిరికివెధవ్వి మగ జన్మెలా ఎత్తావురా ? నీ మొహంనీకు ప్రేమే మిటి ? పెళ్ళేమిటి ? నోరుమూసుకు ఏ నరసాయమ్మనో కట్టుకోక— కుళ్ళిచావ టానికి కాకపోతే నీలాంటి మొగు డెందుకు ఖర్మ ?'' నిజంగానే కోపంవచ్చింది నాకు.

''తిట్టకే సుధా ! నా సమస్యేమీ పరిష్క రించకుండానే తిట్లు...''

''ఛ ! ఇదొక సమస్యట్రా ? — నీచేత గానితనంగానీ !" చటుక్కున లేచి శ్రీనివాస్ వుత్తరం తెచ్చిపడేశాను — ''చూడు : చదివి చూడు! ఎలాంటి స్వతంత్రభావాలు కలవాడో చూడు ! అంతా నీలాంటి అప్రయోజకులే అయితే దేశం పురోగమిస్తుందా ? వున్నతి వుంటుందా ?'' శ్రీనివాస్ నిర్ణయం ఎంత ఘనమైనదో — ఎంత విలువైనదో అప్పుడు గానీ నాకు తెలిసిరాలేదు.

కేశవ్ గబగబా శ్రీను వుత్తరం చదివేసి ఆశ్చర్యంతో తలమున్కలౌతూ నాకేసి చూశాడు — ''అబ్బ ! ఎంత సాహసం ! తల్లినీ, తండ్రినీ, స్నేహితుల్నీ, సంఘాన్నీ, సమస్తాన్నీ ఎదిరించి...అమ్మో ! ఎలా ?''

''మరేమి టనుకున్నావ్ — ఆలాంటి వ్యక్తులే జాతికి భూషణాలు ! ఆరోగ్యకర మైన అభ్యుదయం కావాలి సంకుచిత సంఘా నికి.''

"సుధా ! శ్రీనివాస్ లాంటివారికి కోటి నమస్కారాలు చెయ్యగలను గానీ వారి మార్గంలో ఒక్క అడుగుకూడా వెయ్య లేను—'' అంటూ మడిచేశాడు వుత్తరాన్ని.

నిజంగా వాణ్ణి చూస్తోంటే జాలి వేసింది. పాపం, అది వాడితప్పు కాదేమో ! సృష్టిలో ఇంతవిచిత్రమైన వైవిధ్యంఎందుకుంటుందో! వైద్యశాస్త్రానికి హృదయ నిర్మాణ మంతా ఒకటే అయినా వాటిలోనే ఎంత బలీయత ! ఎంత బలహీనత !

ఎలాగైనా కావలసినన్ని ఋజువులు చూపించి వుదాహరణలు ఎత్తిచెప్పి — కర్తవ్యం బోధించి— ధైర్యం నూరిపోసి— మగవాణ్ణి...చేసి పంపుదా మనిపించింది గానీ... ఊహు ! వూరుకున్నాను. ప్రయో జనంలేదు. వాడివ్వాళే నాకు కొత్తకాదు. ఊహ తెలిసినప్పటినుంచీ తెలుసు.

కేశిబాబు చాలా బుద్ధిమంతు డని బంధు కోటిలో పేరుమోశాడు. దాన్ని పోగొట్టుకో కూడదన్న స్వార్థంకూడా వాడిలో వుంటే వుండవచ్చును.

ఆకలివేస్తే - అన్నం తింటాడు. నిద్ర రాగానే పడుకుంటాడు. అంతబుద్ధిమంతుడు! వీధిలోకి బయల్దేరుతూనే తలదించేసు కుంటాడు. ఆడపిల్ల అనే ఏ ప్రాణినీ వాడు కళ్ళారా చూసివుండడు (సుశీలమాట వేరు). అంత గుణవంతుడు.

మారే శక్తి వాడికిలేదు - మార్చేశక్తి నాకూలేదు. పోనియ్ !

''అయితే ఈ వుత్తరాని కేం జవాబు రాస్తావ్ ?" అన్నాను.

"రాయను. ఏం రాయను.'' అన్నాడు పొడిపొడిగా.

"అది సభ్యతకాదు. ఆఖరిసారి నీ మీద నమ్మకం పెట్టుకుని రాశారు వాళ్ళు. ఏదీ చెప్పకపోవటంకన్నా ఏదో చెప్పటమే మంచిది.''

మౌనంగా లేచాడు.

వా డేమంటాడో చూద్దా మని అన్నాను— "సరేలే ! ఎవరికెవరు ప్రాప్తమో ! దాని కైనా మంచిసంబంధమే వచ్చింది, ఇంజ నీరు భార్య అయితే సుఖపడుతుంది—''

నన్ను మింగేసేలా చూశాడు.

"ఏం ? ఎందు కలా చూస్తావ్? దానిమీద యింకా నీ కేం హక్కుందీ ?'' ఘాటుగా అన్నాను. చూపుల్లో తీక్షణత కాస్త తగ్గించు కున్నాడు. దీనంగా మొహంపెట్టాడు—"సుశీ సుఖంగా వుండటమే నాకు కావాలి. ఇంత అప్రయోజకుణ్ణి నన్ను చేసుకుని ఏం సుఖ పడుతుంది? పెళ్ళిచేసుకోమని రాసేస్తాను.''

నాకు ఒళ్ళు మండింది - "ఒరేయ్ ! ఇదంతా నీ కడుపులోంచి వచ్చిందికాదు. సినిమాలు చూసి, పుస్తకాలు చదివినతాలూకు త్యాగబుద్ధి. లోపల ఏడ్చుకుంటూనే పైకిపోజు లిస్తున్నావ్. నిన్ను చూస్తోంటే సానుభూతి రాకపోగా ...చెప్పొద్దూ...అసహ్యం వేస్తోంది.''

వా డేం మాట్లాళ్ళేదు.

"దామ్మా! పెళ్ళిచేసుకుందువు సుశీలని'' అని చెయ్యిపట్టుకు నడిపిస్తే సిగ్గుసిగ్గుగా నడిచి వెళ్తావ్ కాబోలు పెళ్ళిపీటల మీదికి. అసలు జీవితంలో పెళ్ళికి వున్న విలువా, స్థానం గ్రహించగలిగితే నువ్వింత జడుడిలా వుండలేవు. శరీరం ఆరోగ్యకరమైన గుండె వుంటేనే పనిచేస్తుంది — హృదయాలలా అమరగల భార్యాభర్తలున్ననాడే దాంపత్య జీవితం సలక్షణంగా సాగిపోతుంది — సుశీలని వాంఛించే నీ జీవితంలోకి ఏ ధనలక్ష్మినో, రాజ్యలక్ష్మినో ప్రవేశపెడితే దుస్సీల కాగలదు. జాగ్రత్తగా ఆలోచించుకో "ఆఖరి— ప్రయత్నంచేసి వూరుకున్నాను'' — నాకంఠశోషంతా బొత్తిగా వ్యర్థమైపోయింది — ఏం మాట్లాడకుండా పోయినా "తర్వాత ఆలోచించుకో గలడులే'' అనుకునేదాన్ని— అలాగాకుండా ఆఖర్న తన అభిప్రాయం ఖచ్చితంగా చెప్పేసి మరీ పోయాడు — ''నన్ను క్షమించు సుధా! మతిలేక నీ సలహా కోసం వచ్చానుగానీ అసలీలోపం నాలోనే వుంది. నాన్నకి అయిష్టమయ్యేపని చెయ్యలేను'' అంటూ ముగించాడు.

మౌనంగా సాగనంపాను.


* * *

"ఈ సరికి శ్రీనివాస్ పెళ్ళయిపోయి వుంటుంది. ఈయన తొందరగా వచ్చేస్తే బావుండును. విశేషాలన్నీ తెలిసేవి—''అనుకొంటూ కూర్చున్నా నా సాయంత్రం.

ఇంటిముందు కారాగిన చప్పుడు! హారన్ విధీ విరామం లేకుండా మోగుతోంది — పరిగెత్తికెళ్ళి తలుపులు తీశాను.

నా కళ్ళని నేను నమ్మలేదు. కళ్ళకేం అనారోగ్యం రాలేదు కదా? నా కళ్ళు నన్నే మోసంచెయ్యటం లేదుకదా? నా ఎదుట.. ఎవరూ? కేశవ్...ఫుల్‌సూట్‌లో... ఇన్‌షర్ట్‌లో ... పక్కనే ... సుశీల ... సిల్కు చీరలో... నునుసిగ్గుతో...ఏమిది?

నా నోటివెంట మాటలేవీ వచ్చినగుర్తు లేదు— టాక్సీ వెళ్ళిపోయింది. నాఆహ్వానం లేకుండానే వాళ్ళిద్దరూ లోపలికి నడిచి, నన్ను



''ఆపేశావేం నాన్నా, తాటకి వచ్చి ఏం జేస్తుంది?''

నడిపించి వీధి తలుపులు వేశారు — కాస్త తేరుకోగలిగాను.

నా సంభ్రమం మాటల్లో వెల్లడించగలిగే తెలివి వచ్చింది — "ఏమిటిది? ఏమైంది? మీ రిద్దరూ ఎలా కలిశారు? ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు?'' ప్రయత్న రహితంగా ప్రశ్నల వర్షం కురిసింది నా నోటివెంట.

వాళ్ళిద్దరూ నవ్వారు — కేశిగాడైతే మరీ భళ్ళున బద్దలయ్యాడు.

"ఇంకా సుధని సస్పెన్స్‌లో పెట్టి చంపటం బావుండదు. చెప్పెయ్ సుశీ!'' అన్నాడు దానికేసి వారగా చూస్తూ.

అది మూతి మూడువంకర్లు తిప్పింది — ''నాకేం? ఘనకార్యం చేశావ్‌గా? చెప్పుకోరాదూ?'' అంది.

"అబ్బ! చెప్పండర్రా? ఏమైందీ?''

కేశిగాడు గొంతు సవరించుకున్నాడు — "విను! మేమిద్దరం..అనగా..కేశవ్‌రావూ.. సుశీలారాణీ...మద్రాస్ నగరంలో రిజిష్టర్ మారేజ్ చేసేసుకున్నారు.''

పిడుగుపడింది ఎక్కడో, వురుము లేకుండా...వాన లేకుండా ...నయం — ఈ మొద్దబ్బాయికి అంత సాహసమే!

"అదేం? అలా చూస్తావ్? నమ్మటం లేదూ?'' — వాడు.

''నిజమే వదినా! నమ్మవా ఏమిటి ఖర్మ'' — అది.

"చాలుగాని అసలు సంగతేమిటో చెప్పరూ చంపక.'? విసుక్కున్నాను.

కేశిగాడు సుశీలకేసి ఓ అడుగువేసి దానిమీద దాడిచేస్తున్నట్టు పైటలో దాచుకున్న పుస్తెలు తీసి చూపించాడు— తళతళా ధగధగా మెరిసి పోతున్నాయి — చిన్నిచిన్ని మాంగల్యాలు. కళ్ళు చిట్లించాను. నిజమేనేమో అన్పించింది క్షణం— ఎమ్మేడిగ్రీ తీసుకుంటే గానీ ఇన్‌షర్ట్ చెయ్యననే మంచివిద్యార్థి కేశిబాబు స్థాయి అంతా మార్చేశాడంటే... ఆకు జోళ్ళకిబదులు బాటాబూటూ — పాపిడేలేని క్రాపింగూ...ఆ హుషారు...వుత్సాహం అంతా చూస్తోంటే వాడు సుశీలని పెళ్ళిచేసుకున్నమాట నిజమే నని నమ్మబుద్ధి వేసింది. ఇద్దర్నీ దాదాపు కావిలించుకున్నంత పని చేశాను— ''ఎంత సాహసం చేశావురా! అయితే నువ్వు నిజంగా పిరికివెధవ్వి కాదన్న మాట." విస్తుబోయాను.

"అంతేకాదు వదినా? శ్రీరామచంద్రుడి వారసుడుకూడా కాడు.'' అంటూ నవ్వింది సుశీల— వాడు కోపంగా దానికేసి చూశాడు— "అదే వద్దన్నాను. నేనేం మానాన్నతో దెబ్బలాడానా? నీ లెఖ్ఖేంటి బొమ్మన్నానా?''

''సరేలే, సరేలే, అసలేం జరిగిందో చెప్పరా!'' గొంతుచించుకున్నాను.

"ఏం జరగటం ఏమిటే, ఓరాత్రికి రాత్రి బల్దేరిపోయాను మామయ్యగారింటికి. తెల్లారేసరికి జంటగా మద్రాస్ మెయిల్లో..."

"నీ నీతివాక్యాలూ – బుద్ధి మంతనంగత్రా ఏమయ్యాయిరా? అంత సాహసం ఎలావచ్చింది?''

"ఏం? నువ్వేం తక్కువధైర్యం నూరిపోశావా? నీ దగ్గర్నుంచి పోగానే రెండు రాత్రుళ్ళూ పగళ్లూ ఆలోచించాను. ఆలోచనలదాడి అంతా అమ్మాయి మీదికే పోయింది. ఆ ఇంజినీరుగా డొచ్చి సుశిని పెళ్ళిచూపులు చూస్తున్నాడు; శల్యపరీక్షలు చేస్తున్నాడు – చదవ మంటున్నాడు – రాయ మంటున్నాడు – ఆడ మంటున్నాడు – పాడ మంటున్నాడు – మూడు ముళ్లూ వేస్తున్నాడు – తలంబ్రాలు పోస్తున్నాడు – మాటి మాటికీ దానికేసి చూసి యికిలిస్తూ...విలన్ వెధవ! దొంగరాస్కెల్! చంపేస్తాను. మళ్ళా యికిలించాడో తన్నేస్తాను. సుశీ వాడి మేనమామకూతురా? వాడికేం వుత్తరాలు రాసిందా? వాణ్ణేం ప్రేమించిందా? దాచబెట్టినట్టు వచ్చి పెళ్ళిచూపులు చూస్తాడా? ఎన్ని గుండెలున్నాయ్ వాడికి? రమ్మను రాస్కెల్నితడాఖా చూపిస్తాను. చీరేస్తాను... సున్నంలోకి ఎముకలేకుండా నుగ్గునుగ్గు..."

"ఒరేయ్! ఒరేయ్! అద్దం పట్టుకున్నావు. విసిరెయ్యకు, బాబ్బాబు. దించు, దించు. నెమ్మదిగా...నెమ్మదిగా...''

వీరావేశంతో పుస్తకాలన్నీ విసిరేశాడు. కుర్చీ లన్నీ తిరగదోశాడు. గాలితో ముష్టి యుద్ధం చేశాడు. అలారంటైమ్‌పీస్ పట్టుకుంటే నెమ్మదిగా అందుకున్నాను. అద్దం మాత్రం అందకుండా పై పైకి...శాంతించాడో క్షణం – నిట్టూర్చాను సంతోషంగా – "అయితే నీకు మొండిధైర్యం వచ్చేసిందన్నమాట.

''హూ!'' హుంకరించాడు మళ్ళా – పళ్ళు పటపట లాడించాడు–

"తప్పంతా మా నాన్నదే. నాకిష్టమని తెలిసికూడా ఆయన కెందుకా మూర్ఖత్వం?– సూర్యుడు తూర్పున పొడిచినా...సముద్రాలింకిపోయినా...ఆకాశం...''

''మాటలు తడబడుతున్నావ్ రా తమ్ముడూ!''

"ఛీ! నువ్వడ్డురాకు, చెప్పనియ్." అవిర్లు గక్కాడు.

'పిల్లిలా కూర్చున్నాను – వాడు చెయ్యి పైకెత్తి జైకొడుతున్నట్టే అన్నాడు – ''సుశీలని నాదాన్నిగా చేసుకుతీర్తాను. ఛలో ఢిల్లీ!"

కాస్త ధైర్యంతెచ్చుకు అన్నాను అనునయంగా – "కేశిబాబూ! నువ్విలా అరుస్తోంటే నాకు భయం వేస్తోందిరా! నువ్వేమిటో బొత్తిగా మారిపోయావురా! నీకు కోపం కూడా వస్తోందిరా!''

పాపం వాడు బాగా శాంతించాడు. నెమ్మదిగా నాదగ్గిర కూర్చున్నాడు –

''నువ్వేకదే మారిపొమ్మన్నావ్.''

''అన్నాననుకో – అయితేమాత్రం ఒళ్లెరక్కుండా అరుచుకుంటావా? నెమ్మదిగా చెప్పు – నాకెంతో వినాలనివుంది. పోనీ నువ్వు చెప్పరాదటే సుశీలా!''

"ఒద్దు. దానికి మాటలే సరిగ్గారావు. నే చెప్తున్నాగా?....వాళ్ళింట్లో యిలా కాలు పెట్టానోలేదో చావుకబురు చల్లగా చెప్పాడు సత్తిగాడు. దొంగవెధవ! "నువ్వు చాలా ఆలశ్యంచేశావు బావా! సుశీలపెళ్ళి నిర్ణయమైపోయింది–వారంరోజుల్లో తాంబూలాలు.."

"మరేం వినలేదు. నేనంతా వూహించిందే. ఏం జంకలేదు. నా ఆలోచనలు వేరు– నా పథకం వేరు – "పోనీలే. ఈ వుత్తరం సుశికి యిచ్చెయ్ జాగ్రత్తగా." అంటూ రైల్లో రాసి అంటించిన కవరు వాడి చేతుల్లో పెట్టాను – అక్షరాలతో ఏడ్చుకున్నానేమోననుకుని జాగ్రత్తగానే దానికి అందజేశాడు– నేను రాసినట్టే రాత్రి పన్నెండుగంటల సమయానికి దక్షిణంవేపు దొడ్లో మందార చెట్ల మధ్య ప్రత్యక్షమయ్యింది సుశీల. దాన్ని చూస్తూనే నా ప్రాణం లేచివచ్చింది – "కోపంగా వుందికదూ నామీద? కోపతాపాలు తర్వాత. ఓగంటలో మనం బయటపడి స్టేషన్‌కి పోవాలి. తిన్నగా మద్రాస్ పోయి పెళ్ళిచేసుకుందాం''అన్నాను గబగబా.

సుశీల ఆశ్చర్యంగా నమ్మలేనట్టు అంది – "పెళ్ళా? మనకా?'' అంతలోనే కోపం తెచ్చేసుకుంది – ''నీ ప్రయోజకత్వానికి సంతోషం! నీకోసం సంవత్సరాల తరబడీ ఎదురుచూశాను. లెక్కలేనట్టే విదిలించావు. కాస్త మాకూ పరువూ ప్రతిష్టా వున్నాయని గుర్తుంచుకో బావా!"

"నన్నుక్షమించు సుశీ! ఇది కోపగించుకునే సమయంకాదు. ఇన్నాళ్లూ నేనో జడ్డివెధవలా వున్నానంటే ఒప్పుకుంటాను. అదంతా మర్చిపోయి మనం వెళ్ళిపోయే ప్రయత్నాలేవోచెయ్యి–వద్దు.ఏప్రయత్నాలూ వద్దు, అన్నీ అక్కడే కొనుక్కుందాం. నా దగ్గిర చాలా డబ్బుంది. వాచ్ అమ్మేశాను. సైకిల్ అమ్మేశాను, వుంగరాలమ్మేశాను– నేను మిగిలి నీదగ్గర కొచ్చాను. ముందు పెళ్ళి చేసేసుకుని తర్వాత సమస్యలన్నీ ఆలోచిద్దాం.''

"అయితే నువ్వు నిజంగా మారావన్న మాట" సంభ్రమంగా అంది సుశీల.

"నిజం సుశీ! నన్ను నమ్ము. నువ్వు లేకుండా నా బ్రతుకు లేదు. నీ కోసం సర్వం త్యజించటానికి సిద్ధంగా వున్నాను."

"మామయ్యని కూడా...?''

"సుశీ! ఆయన్ని నేనేం తిరస్కరించలేదు. అగౌరవ పర్చలేదు. కాకపోతే ఆయన చేతుల మీదుగా అవాల్సిన పెళ్ళిని నేనే చేసుకుంటున్నాను. ఇది తప్పేనని ఆయన చివాట్లు పెడితే భరించటానికి సిద్ధంగా వున్నాను."

"అయితే నిజంగా నన్ను వచ్చెయ్యమంటావా?"

"రానంటే ఎత్తుకుపోతాను. నువ్వే నడిస్తే నాకా బరువు తగ్గుతుంది."

"అబ్బా! హీరో అయినట్టే వున్నావ్. ఇంత ధైర్యస్థుడివి ఖచ్చితంగా చెప్పేసి యింటిదగ్గిరే పెళ్ళి చేసుకోరాదూ?''

"ఒద్దు సుశీ! ఆ యిబ్బందుల్ని తట్టుకోలేం. చెప్తే నాన్న ఒప్పుకోడు. ఒప్పించలేను–ఆయన్ని కాదని మీ నాన్నతో చెయ్యి



కలపలేను. పైగా మరో సంబంధం నిర్ణయం చేసేసిన మీ నాన్న మాట తిరగ నంటాడు. ఈ సమస్య లన్నీ ఏం కాను ? ఏదీ ఒద్దు. ఇదొక్కటే మార్గం."

"బావా ! నువ్వెంత మారిపోయావ్ ! నిజంగా మారిపోయావ్ ! నా ఆశ లన్నీ నాశన మయ్యా యనుకున్నాను. నా కల లన్నీ కల్ల లయ్యా యనుకున్నాను. నా జీవిత మంతా ధ్వంస...''

"ష్ ! నీ కవిత్వం తర్వాత...టైమై పోతోంది. నడు...పోదాం.''

"ఇలాగే, అమ్మా వాళ్లు..."

"నడవ్వోయ్– మళ్ళా వారం రోజుల్లో రామా ?"

ఇద్దరం చీకట్లో పడి స్టేషన్ కేసి పోయాం.

సుశీల పగలబడి నవ్వటం ప్రారంభించింది.

"ఏయ్ ! ఏమి టా నవ్వు ?" గద్దించాడు వాడు.

"కొత్త పెళ్ళికూతురివి కూడాను. సిగ్గు లేకుండా ఏమి టా నవ్వు ?'' వంత పాడాను నేను.

"కొత్త పెళ్ళికొడుక్కి మాత్రం సిగ్గు అక్కర్లేదు కాబోలు'' అంటూ మళ్ళా నవ్వింది–''ఏం కోస్తున్నాడు బావ ! కాళ్ళా వేళ్ళాబడి బ్రతిమిలాడుకున్న దంతా దాచేసి పెద్ద హీరోలాగ పోజు లెడుతున్నాడే !''

''ఒరేయ్ ! వెధవగప్పాలు కొట్టక జరిగింది జరిగినట్లు చెప్పు'' అన్నాను వాడి కేసి కోపంగా చూస్తూ. వా డొకసారి దాని కేసి కొరకొరా చూసి అన్నాడు నాతో–

"నన్ను వలిచేశా నని అన్ని వుత్తరాలు రాసిందా ! తీరా రమ్మంటే ఎంత ఏడిపించిం దనుకున్నావ్ ?'' ఫిర్యాదు చేశాడు.

"సరే ! సరే ! ఏమైంది తర్వాత."

''ఇంకేమైంది ? తిన్నగా మద్రాసూ... రిజిష్ట్రారాఫీసులో పెళ్ళీనూ...''

"నిజంగా ?''

"బావుంది. ఈ వాగు డంతా వ్యర్థమే."

"మరి బాబాయి మా టేమిటి ? వింటే వుగ్రుడో...వుగ్రసేనుడో..."

''ఏం కాలా. తక్షణం బయల్దేరి రమ్మని రెండు వందల రూపాయలు టి. ఎమ్. ఒ. చేస్తూ పెద్ద వుత్తరం రాశాడు."

"ఏమి టేమిటీ ? నిజం...ఎప్పుడు ? ఎలా తెలిసింది ?"

"అబ్బబ్బ ! ఏమి టా కంగారు ? చెప్ప నివ్వవేం ?

"వెధవ సస్పెన్స్‌తో నన్ను చంపు తున్నావ్. చెప్పు తొందరగా."

"పెళ్ళి జరిగిందే తడవుగా ఇద్దరం యిళ్ళకి చెరో వుత్తరం పడేశాం-"

"ఆహా ! ఏమని ?"

"పసివాళ్ళం చేసిన ఈ మహాపరధాన్ని మనస్ఫూర్తిగా క్షమించి ఆశీస్సులు పంపిస్తే అందుకు తరించిపోతా మని."

"అబ్బా ! కవిత్వం బావుంది."

"మా నాన్న కో మస్కా కొట్టానులే -- మీ చేతుల మీదుగా పెళ్ళి జరిగే అదృష్టం నాకు లేకుండా పోయింది. ఎన్ని విధాల సంతోషంగా వున్నా ఈ లోటు నన్ను బాధిస్తూనే వుంటుంది — ఇక్కడో సైకిల్ షాపులో పనికి కుదిరాను—నెమ్మదిగా ఏదైనా వుద్యోగం చూసుకుంటాను. చిన్నగది ఒకటి అద్దెకు తీసుకున్నాను, పన్నెండు రూపాయలకి...అలా అలా తల్చుకుంటే గుండె ద్రవించిపోయేలా రాసేశాన్లే-

"మీరు పిలవనంత మాత్రాన మాకేం తక్కువలేదు నాన్నగారూ! దర్జగా తవ్వెడు నూకలు పొంగించుకుని డ్యూయెట్లు పాడు కొంటున్నాం—అని అర్థం వచ్చేలాగ రాసి పారేశా వన్నమాట."

"సరిగ్గా అంతేలే. తిరుగుటపాలో రెండు పచ్చనోట్లు రాలిపడ్డాయ్—అమ్మ బెంగెట్టు కుందనీ, జాగ్రత్తగా అమ్మాయిని తీసుకు తక్షణం బయల్దేర మనీ..."

"చిత్రంగా వుందే ! ఎందు కింత గమ్మత్తుగా మారిపోయా డంటావ్ ?"

"ఆయన్ని నేనూ సరిగ్గా అర్థం చేసుకో లేకపోయాను ఇన్నాళ్ళూ. తనమాట చెల్లితీరుతుందీ అన్నప్పుడు చెల్లించుకోటానికి మొండి ప్రయత్నం చేస్తాడు—ఇక లాభం లేదని తెలిసిందా పద్ధతి మార్చేస్తాడు-తన మర్యాద ఎప్పటిలాగే నిలబెట్టుకుంటాడు - ఇప్పుడు నేనే ఓ వెర్రినాగమ్మ నయ్యాను. తండ్రికి చెప్తే వాడే పెళ్ళి చేశేవాడుగా? అంటా రంతా. పోనీ నాన్నకి కోపం రానందుకే నాకు సంతోషంగా వుంది. వెంటనే వచ్చేస్తున్నామని లెటర్ రాసి ... ఇలా జాలీగా ... హేపీగా ... వూళ్ళు తిరుగుతూ యిటు నీ దగ్గిరికి.. ష్ ! కాసిన్ని మంచినీళ్ళు."

"శుభం !" ముందు నేను తాగి వాడి కిచ్చాను. ఈ కేశిగాడికి వాగుడు కూడా ఎక్కువైంది — మాటి మాటికీ దాని కేసి చూడటం—కొత్తజీవం పోసుకుంటూన్నట్టు పుంజుకోవటం చేస్తున్నాడు.

సుశీ ఏదో పుస్తకం మహాశ్రద్ధగా చదివి పారేస్తోంది. ఉన్నట్టుండి నాకు పుట్టెడు దుఃఖం ముంచుకు వచ్చింది— "నన్నెంత నిరాశ పర్చావురా తమ్ముడూ ! నీ పెళ్ళికి పేద్ద బహుమతీ స్వీకరించా లని కనిపెట్టు కున్నాను కాదుట్రా ? అయ్యో ! నా ఆశ లన్నీ నాశనం చేశావురా !—నా వూహ లన్నీ..."

"అంతలేసి నిట్టూర్పులు విడవకే సుధా! నిన్ను మర్చిపోతానా? నువ్వు పోసిన జీవమే కదే యిది ? నీ తర్వాతేనే ఎవరైనా..."

"నీ పెళ్ళామైనా !" - అది ఉరిమి చూసింది నా కేసి.

"బొత్తిగా దాని ముందే అడక్కే ఆ ముక్క..ఏదే సుశీ నీ చిట్టి చిట్టి చేతుల్తో.."

"నా కేం చిట్టి పొట్టి చేతుల్లేవు. బాగానే వున్నాయి" అంటూ లేచి బెడ్డింగ్ విప్పింది- చక్కటి ఓ అట్టపెట్టె తీసింది-మరీ చక్కటి కాయితం పొట్లాం విప్పింది-ఇంకా చక్కటి.. కనకాంబరం రంగూ, హంసల అంచూ... జరీ చీర-నా కళ్ళు జిగేల్ మన్నాయి.

"నీ స్వహస్తాలతో సోదరీమణికి యిచ్చుకో" కోపం ప్రదర్శిస్తూ వాడికి అందచేసింది - ఆ చీర కాస్తా వచ్చి నా చేతుల్లో వాలింది - "ఇది చాలా చిన్న బహుమతి సుధా ! కనీసం నీ కో నెక్లెస్సయినా తీసుకు రావా లనుకున్నాను. డబ్బు చాల్లేదు. ప్రస్తుతానికి క్షమిస్తావు కదూ ?"

నాకు మతే పోయింది. మాట్లాళ్ళేక పోయాను.

"మే మిద్దరం యింటికి చేరగానే నాన్న గ్రాండ్‌గా బ్రహ్మాండంగా బంధు బలగాని కో పార్టీ యిస్తాళ్ళే-నా తెలివితక్కువతనాన్ని ఏకిపారేస్తా డనుకో-అది వేరే సంగతి - మీకు ఆహ్వానం వస్తుంది ప్రత్యేకంగా. బావా నువ్వూ రెక్కలు కట్టుకు రావాలి సుమా ! అప్పుడు కావలసినన్ని బహుమానాలు నీకు."

"ఉహు ! ఇల్లంతా దోచిపెడతావు కాబోలు" అసూయ కన్పించేలా మూతి తిప్పుకొంది సుశీల.

"చూడరా తమ్ముడూ ! నీ పెళ్ళాం సణుక్కుంటోంది" ఫిర్యాదు చేశాను.

"సిగ్గు లేకపోతే సరి. పుట్టింటినుం చో చిల్లికానీ అయినా తెచ్చిందా ?"

"వెధవ చిల్లికానీ భాగ్యం పుట్టింటినుంచే తేవా లేమిటి ? నా దగ్గిరే వుంది."

"ఆఁ వుంచుకో - వుంచుకో - వుంగరం చేయించుకో."

"నువ్వేం చెప్పక్కర్లా."

"అవుతే మరదలా ! ఇంకా వాణ్ణి అరే ఒరేఅని పిలుస్తున్నావేమి టమ్మా ? నీ కేం మర్యాదా మన్ననా అక్కర్లేదా ?"

"ఆఁ ఆఁ అదే నేనూ అడుగుదా మను కొంటూ మర్చేపోతున్నాను. నన్నేగాదు మాసుధనికూడా బహువచన ప్రయోగాలతో.. తెలిసిందా ?"... వాడు చాలా కోపం తెచ్చుకున్నాడు. దాని కేం ఖాతరున్నట్టు లేదు.

"ఏవిటీ ? దండ ప్రయోగాలా ? తెలిసిందిలే."

"ఒరేయ్ ! మాటలు నేర్చిన కుక్కని వేటకి తీసికెళ్ళినట్టే వుందిరా ! నువ్వింత తెలివితక్కువ పనెందుకు చేశావ్‌రా తమ్ముడూ ? - నిన్ను లోకువ చేసుకుని... అసలే అమాయకుడివాయే! ఏం ఏడిపిస్తుందో ఏమిటో."

"ఆ పప్పులేం వుడకనివ్వనులే. తల తిక్కగా మాట్లాడిందో ఒంగదీసి నడ్డి

విరగ్గొడుతూ వుంటాను. పీపు చదునుచేస్తూ వుంటాను.''

ఫక్కుమంటూ నవ్వింది సుశీల–"అసలీ నల్లబావని చేసుకోవటం...ప్చ ! నాదే బుద్ధి తక్కువ.''

"ఇదిగో ! అలా అంటే వూరుకోను. కొండ నలుపు.''

"చింతపండూ నలుపే."

"ఏనుగు నలుపు.''

"ఎనుబోతు నలుపు."

"రామచంద్రుడు నలుపు...మహావిష్ణువు నలుపు..."

"ఆనంద్ నలుపు...ముకుంద్ నలుపు.. గోవింద్ నలుపు."

"వాళ్ళెవరు మధ్య ?"

"స్వయానా మగవాళ్ళులే."

"అవునవును. వెధవ తెలుపెందుకు – గోడలూ వున్నాయ్ సుద్దల్లా."

"సరిసరి. మనం వెళ్ళే దేమైనా వుందా?"

"అవునే సుధా ! ఇక పోతాం.''

"అదే విట్రా ? ఈ రాత్రికి వుండ కూడదూ ?''

"కాదే ! రేపు మధ్యాన్నానికి యింటి కెళ్ళాలి. రాత్రికి రైల్లో పడాలి. పెళ్ళి కూతురుగారికి మేనా వస్తుందో ఏమో స్టేషన్‌కి.''

"నేనేం మేనా ఎక్కను.''

"అవున్రా ! ఇది పల్లకీయే ఎక్కుతుంది పోనీ ! – వెళ్ధురుగానీ ఓ క్షణం మౌనంగా విశ్రమించండి. వేడి తేనీరు తీసుకొస్తాను." లేచాను.

"నీ హాస్యం చాలాపాతదేగానీ వేడకుండా కాసిన్ని టినీళ్ళు పొయ్యి వదినా ! అతిథి మర్యాదల ప్రసక్తి లేదేమా అని తెగచూస్తు న్నాను."

పొగలుకక్కే టీకప్పులు అందిస్తూ గర్వంగా అన్నాను – ''ఈ టీనీళ్ళ విలువ ఎంతనుకున్నా వేమిటి ? నువ్వు అమృతం పోసినా సాటిరాదు."

"ధన్యురాల్ని.''

"వెళ్ళొస్తాం సుధా !''

"ఇంకా నా అనుమ తెందుకురా నీకు ? అది కాగడాలా పక్కన వెలిగిపోతుంటేనూ. వెళ్ళిరండి. మీరు ఏకాంతాల్లో ప్రేమసాగ రాల్లో మునకలు వేస్తోంటే నా వేడికోలు విన్పిస్తుందా ఏమిటి ?''

పెట్టె వెదికి ఓ రవికెలగుడ్డతీసి మరదలికి బొట్టుపెట్టాను. కళ్ళవెంట నీళ్ళుతిరిగాయి. ఎక్కువ దుఃఖాన్నేకాదు...ఎక్కువ సంతోషాన్నికూడా భరించలేం – రిక్షా సాగిపోతుంటే కన్నీళ్ళతో వీడ్కోలిచ్చాను. అదృష్టవంతుడు ! ఆశలు పండించుకున్న వాడు !

* * *

ఆరాత్రే మావారు వూరునుంచి వచ్చారు. ఎంతటెంతట ఈ సంతోషవార్త ఆయనకు చెప్దామా అని నేను కలవరిస్తోంటే ఆయన కూడా మరేదో గొప్పవార్త నాకు చెప్పబోతు న్నట్టు కన్పించారు. మొహంలో కొత్తదనం చిరునవ్వూ ఏమిటో చిత్రంగా తోచాయి. రిక్షా పంపించి లోపలికొస్తూనే అన్నారు – "సుధా ! నీ కో ఆశ్చర్యకరమైనవార్త.''

''మహదాశ్చర్యకరమైనవార్త నేనే మీకు చెప్పా లనుకొంటున్నాను. ఏమిటో మీరే చెప్పండి ముందు.''

"శ్రీనివాస్ పెళ్ళయింది.''

''కాశీవెళ్ళి గాడిదగుడ్డు తెచ్చినట్టేవుంది"

''వినుమరి, వధువు...కుసుమకాదు.''

"కుసుమ...కాదూ ?"


"కాదు – రాజేశ్వరి. పరికిణీలూ ఓణీలూ వేసుకునే పదహారేళ్ళ పల్లెటూరిపిల్ల !''

''ఏమిటి మీరు మాట్లాడేస్తున్నది ? శ్రీనివాస్ పెళ్ళిగురించేనా ?''

"ఆహా ! అక్షరాల శ్రీను...పెళ్ళి కబురే !''

"కుసుమ్ ఏమైంది ?''

"పెళ్ళినాలుగురోజు లుందనగా శ్రీనుకు ఓ వుత్తరం రాసి వెళ్ళిపోయింది–దూరంగా



స్నేహితు నింటికేమో వెళ్ళిందనుకున్నారు– నెల్లాళ్ళు శెలవు పెట్టిందట ఆఫీస్‌కి."

నా కేమీ అర్ధంకాలేదు. తల తిరిగిపోతు ట్టనిపించింది – కుసుమ్ వెళ్ళిపోవటం ఏమిటి ? శ్రీనుపెళ్ళి పల్లెటూరిపిల్లతో జరగటం ఏమిట ? శ్రీను ఒప్పుకున్నాడా ? ఎలా ఒప్పుకున్నాడు ?

''ఆస లేమైంది? కుసుమ్‌కి పెళ్ళియిష్టం లేకపోయిందా ?''

''చేసుకునేంత సాహసం లేకపోయింది సుధా ! నేను వెళ్ళేసరికే ఆవిడ వెళ్ళిపోయింది – ఈ పెళ్ళిప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి– "ఇదంతాఏమిటిశ్రీనూ?" అని అడిగితే కుసుమ్ రాసినవుత్తరం అందించాడు –

"మీరూ నేనూ తప్పితే మరెవ్వరూ ఆమోదించని ఈ పెళ్ళి చేసుకుంటే మనం సుఖపడతామని అనుకోను. రేపు సాటివారిలో మనం పొందే విలువ అంతంత మాత్రమే. కొత్తసమస్యల్ని సృష్టించే ఈ అభ్యుదయాన్ని సాధించడంలో అర్ధమేమీ కన్పించడంలేదు – పదిమందిమధ్య నవ్వులపాలై ఈ దౌర్భాగ్యాన్ని స్వీకరించటానికి మీరు సిద్ధపడినా ఆ ఔన్నత్యాన్ని నేను అందలేకపోతున్నాను. క్షమించండి.''

ఆ వుత్తరం చదివి శ్రీను నడిగాను – "ఆసలెందుకిలా తనవుద్దేశ్యం మార్చుకుంది? పెళ్ళికి ఒప్పుకుందని రాశావుగా ?''

శ్రీను దాదాపు కన్నీళ్ళతో అంతా చెప్పాడు – "నేను ఏ విధంగానూ లొంగకపోయేసరికి మావాళ్ళు కుసుమ్‌మీద ఒత్తిడి ప్రారంభించారు. మా అమ్మ కుసుమ్‌చేతులు పట్టుకు ఏడ్చిందట – తన కొడుకుని రక్షించి వదిలెయ్యమని – చిన్నవాణ్ణి పెళ్ళి చేసుకోవటం భావ్యం కాదనీ – పరువు ప్రతిష్ఠల కుటుంబానికి మచ్చ కలిగించవద్దనీ – ఏమీ టేమిటో... ఇదంతా ఆ తర్వాత నాకు తెలిసింది– కుసుమ్ వెళ్ళిపోయింది.''

''పోనీ కుసుమ్ శెలవుమీదే వెళ్ళిందిగా? పెళ్ళిప్రయత్నాలు మానుకుని ఆగకూడదా నువ్వు ?''

''లేదు మధూ ! నేను కుసుమ్‌ని పెళ్ళి చేసుకునే వుద్దేశ్యం మార్చుకున్నాను. స్వయంగా నావుద్దేశ్యాలు విప్పిచెప్పినా నన్ను విశ్వసించలేకపోయింది. ఎవరో ఏదో అన్నారని జంకినన్నాళ్ళూ తనీ సంస్కారానికి అర్హురాలుకాదు–పెళ్ళి అనేది కేవలం ఒక్క వ్యక్తి సాహసంతో జరిగేదేకాదు ! ఇద్దరికీ మనోనిగ్రహం–ఆత్మవిశ్వాసంవుండితీరాలి– ఇంకా కుసుమ్‌కోసం నిరీక్షించడంలో అర్థం వుందంటావా ?"

నిజమే ననిపించింది – ''అయితే మరో మంచిసంబంధంచూసి నీకు అన్ని విధాలా నచ్చినపిల్లని.. చేసుకోవచ్చుగా? ...క్షమించు శ్రీనూ...పెళ్ళిపట్ల నీకున్న అభిప్రాయాలు...''

''అవి ఎప్పుడూ వుంటాయి మధూ ! రాజేశ్వరిని చేసుకోటానికి ఎందుకు ఒప్పుకున్నానో ఎలా ఒప్పుకున్నానో నాకే అర్ధం కావడంలేదు. కాని ఒప్పుకున్నాను.''

"శ్రీనివాస్ !...బాగా ఆలోచించావా ?

"లేదు మధూ ! లేదు. బాగా ఆలోచిస్తే ఏదీ చెయ్యలేను. ఆత్మవిమర్శ చేసుకుంటే ఏమీ మిగిలినట్టులేదు. అంతా శూన్యం !..." శ్రీను భారంగా నిట్టూర్చాడు. ఆ పెళ్ళి విషయం మరేమీ ప్రస్తావించలేదు – దేవుణ్ణి విశ్వసించని శ్రీను పెళ్ళి...దేవాలయంలో శాస్త్రోక్తంగా జరిగిపోయింది."

మావారు మౌనంగా కూర్చున్నారు. నా కళ్ళవెంట కన్నీళ్ళు జలజలా రాలిపడ్డాయి. దుఃఖం పెల్లుబికివచ్చింది.

శ్రీనూ...నీ వ్యక్తిత్వం యింత బలహీనమైనదా ? అంటూ ఘోషించింది నా అంతరాత్మ.నా గాలిమేడలన్నీ ఆ క్షణంలో కూలిపడ్డాయి. మనశ్శక్తిమీదే విశ్వాసం నశించిపోయింది.

''శ్రీనుకీ ఆ పిల్లకీ పదేళ్ళు వ్యత్యాసం ! ఏమంత చదువుసంధ్య ల్లేని పల్లెటూరిపిల్ల– మంచి రూపవతేకానీ...'' మాటలు దొరకనట్టూ – మరేమీ చెప్పలేనట్టూ – వూరుకున్నారాయన.

ఎటో చూస్తూ వుండిపోయాను.

* * *

ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పర్చుకుని సాహసించి సుశీలని పెళ్ళిచేసుకున్నాడు కేశవ్ ! – ఉన్న వ్యక్తిత్వాన్ని చంపుకుని ఏదో బలహీనతకు లోనై రాజేశ్వరిని అంగీకరించాడు శ్రీనివాస్ ! ఈ రెండూ నమ్మలేని నిజాలు–కానీ – ఈ నిజాలకున్న విలువ నాదృష్టిలో చాలా తక్కువ – కేశవ్ జీవితం ధన్యమైనదనీ – శ్రీనివాస్ బ్రతుకు పతనమైందనీ నేను అనుకోను.

మానవ మనస్తత్వం తాలూకు ఆవేశం కేశవ్‌నూ – అసహాయత శ్రీనివాస్‌నూ – ఆవరించుకున్నాయి క్షణకాలం. వాస్తవాలు వూహాతీతంగా వుంటాయన్న విషయం అనుభవపూర్వకంగా తెలియటానికే యిది జరిగిందేమో !